కాంపౌండ్‌వాల్ లోపల ఓ పదివరకు కొబ్బరిచెట్లు, ఈశాన్య మూల నారింజ చెట్టు, పెరట్లో విరక్కాసిన జాంచెట్టు, వరండానుండి చూస్తే కన్పించేట్టు వెడల్పయిన సిమెంట్ పళ్లెంతో పెద్దబావి.

పాతకాలపు వాసన్లకి కొత్త సెంటు పూస్తోన్నట్టు కొత్తగా పెట్టించిన నీటి మోటారు. పెంకులు పీకించేసి ఆధునికతకు అద్దం పట్టాలనే తాపత్రయంతో కొత్తగా కట్టించిన డాబా.

తీరిపోయింది యీనాటితో, యీ యింటికీ తనకూ గల అపురూప అనుబంధం సమసిపోతోంది!

మగ పిల్లల చదువుల సమయంలో, ఆడపిల్లకి కట్నం యివ్వాల్సిన రోజుల్లో కూడా భార్య నగలు తాకట్టు పెట్టే పనులు నిర్వర్తించాడే కానీ ఏనాడు యింటిని అమ్మేయ్యాలనుకోలేదు.అయినా యిప్పుడు తన కొడుకు మాత్రం ఏమన్నాడని? ఇల్లి అమ్ముతాననలేదు కదా! మరి? మరి? మరి, తనెందుకిలా బాధపడిపోటం?

తీవ్రంగా ఆలోచించడంవల్ల పరంధామయ్యకు కళ్లు తిరిగి శోషవచ్చినట్టు ఉంది. నెమ్మదిగా నడుస్తూ వాలు కుర్చీలో చేరబడ్డాడు. అతనికి ఆకలిగా ఉంది. ఎవరయినా యింత ముద్ద పడేస్తే బావుణ్ణనిపిస్తోంది. పాతరోజులు గుర్తొస్తున్నాయి. అన్నపూర్ణ దగ్గరుండే వడ్డిస్తూ కమ్మని కబుర్లు చెప్తోంటే హాయిగా పదింటికల్లా తినేసి ఆఫీసుకెళ్లి మళ్లీ సాయంత్రం అయిదింటికల్లా ఇంటికి చేరేవాడు.

# తనదాకా వస్తే

## ఉరిటి సులేఖ

వంట గదికి పక్కనే చిన్న గది. కొట్టు గదిలాంటిది తరతరాలనుండి పురిటిగదిగా స్థిరపడిపోయి, వరండాలో కుడిపక్క కిటికీపక్క ఆరడుగుల పొడవాటి స్థలం. ఇంట్లో చావులకి మాత్రమే కేటాయించిన 'చావడీ'లా, ముత్తాతల దగ్గర్నుండీఆ వంశం వారంతా అక్కడే అంతిమశ్వాస తీసుక్కున్న గుర్తుగా!

ఆ యిల్లు చిన్నప్పటినుండీ, చిన్నప్పటినిండీ ఏం ఖర్మ! పుట్టినప్పటినిండీ చూస్తున్నదే అయినా, ఆ గోడలు, ఆ గచ్చులు, యిటికెల్తో కట్టబడిన ఎర్రటి ప్రహరీగోడ, పచ్చి వాసన్లని గాలుల్లో కల్పుతోన్న ఆ చెట్లు, పువ్వుల్తో అందంగా ఊగుతున్న ఆ మొక్కలు, వానలో తడిసి తలంటి పోసుక్కున్నట్టన్పించే ఇల్లాలులా యింటెదుటి ఊడలమర్రి, యివి... అవి... యివేకాక, .. యింకా ఏవో!... ఎన్నో... కళ్లముందు, కళ్ల వెన్క!

గత కాల వారికలు! మమతల మచ్చలు! మాసిపోతోన్న మరకలు! మరవనంటున్న మనసు! యివన్నీ చాలా చాలా పాతవే అయినా పరంధామయ్య పరవశంగా వాటినే చూస్తోన్నాడు. అప్పుడే కొత్తగా చూస్తోన్నట్టు తమకంగా! కళ్లార్పకుండా!

వెల్గు ఆరిపోతోన్న అతని కళ్లల్లో చిన్న తడి ఎడారిపై రాలిన నీటిబొట్టులా ఆర్ద్రత, అతని ఎండిన ఎడదని తడిపింది లాలనగా!

రాత్రి కొంతసేపు యిదిగో యిదే వరండాలో, యిద్దరు మగపిల్లల్ని, ఒక కూతుర్ని దగ్గర కూచోబెట్టుకుని చదివించేవాడు. యిదిగో యిదే వాకిట్లో పిల్లలందరికీ పెళ్లిళ్లు చేసాడు. యిదిగో యిదే వసారాలో, యీ గుమ్మంనిండే అన్నపూర్ణని కాటికి పంపాడు. తను కూడా యిక్కడే ఆఖరి శ్వాస తీస్కోవాలని కోరుకోటం నిజంగా గొంతెమ్మ కోరికే!

పాపం తన కొడుకు మాత్రం ఏంచేస్తాడు? వాడుమాత్రం ఎంతకాలమని అన్ని బాధ్యతలు మోయగలడు?

చిన్నాడేమో స్టేట్సెంటూ పరిగెత్తాడు పాలు తాగటాన్కని! పెద్దాడు మాత్రం ఎంతకాలమని యిలా నీళ్ల నముల్తూ కూచుంటాడు? వాడికీ ఓ సంసారం, సంపాదించే భార్య, పిల్లలు. వాడేం ఒంటరివాడు కాదుకదూ!

కడుపులో ఆత్మారాముడు గోలెడుతున్నాడు. ఫోటోలో అన్నపూర్ణ జాలిగా నవ్వుతోంది. కష్టంగా లేచాడు పరంధామయ్య. మనవలిద్దరూ స్కూళ్లకి వెళ్లిపోయారు. కొడుకూ, కోడలూ ఆఫీసుకు



వెళ్లిపోయారు. యింత యింట్లోనూ తక్కువ్వాడే! యిప్పుడు తనకేదన్నా అయితేనో! పట్టించుకొనే నాథుడే లేదు.

ఆమధ్య ఓ వారం రోజులపాటు పరంధామయ్యకు బాగా సుస్తీ చేసింది. విపరీతమయిన జ్వరం, వాంతులు, విరేచనాలు. పాపం కొడుకు మాత్రమేం చేస్తాడు? ఎంత దబ్బిస్తామన్నా ఒక్క పనిపిల్ల కూడా కుదరలేదు. కోడలు పిల్ల మాత్రం ఏం చేస్తుంది? అప్పటికే అలసి పోయి వస్తుంది. మళ్లీ యీ రోగిష్టి ముసలి పీనుగు గోలని ఎలా తట్టుకోగలదు? అదే స్థానంలో ఆమె తండ్రి ఉంటే! ఏమో! కనీసం జాలన్నా కన్పరిచేది! కనీసం దానిక్కూడా తాను నోచుకోలేకపోయాడు.

ఉన్న ఒక్కగానొక్క కూతురు సంసారాన్ని వదిలి, పిల్లల చదువులు పాడు చేస్కొంటూ, మొగుడికి యిబ్బంది పెడ్తో తను మాత్రం ఎంతకాలమని యీ ముసలాడి సేవకోసం ఉండిపో గలదు? ఒహవేళ ఏ వేసవి సెలవుల్లోనయినా వచ్చినా అంత కుటుంబాన్నీ ఎవరు మాత్రం ఎంతకాలమని పోషించగలరు? యీ కాలంలో ఎవరిల్లు గడవడం వారికే గగనమవుతోంది.

తనకు తనే సర్దిచెప్పుకొంటూ భోజనం అయిందనిపించాడు పరంధామయ్య. అన్నం తినంగానే ఓ కునుకు తీయటం పరంధామయ్యకు రిటైర్ అయినప్పట్నుండీ తప్పించుకోలేని అలవాటయిపోయింది.

కానీ ఆ రోజెందుకో అటువంటి రెప్పకూడా పడడంలేదు. బహుశా ఆరోజుతో ఆ యింటి రుణం తీరబోతుందని కాబోలు.

అతని కళ్లల్లో చిన్న కొడుకు మెదిలాడు. వాడు చాలా చురుకు. అన్నింట్లోనూ ఫస్టే. అందుకే అందర్నీ వదిలేసి అమెరికా వెళ్లిపోతున్నప్పుడు కూడా ఏమాత్రం జంకలేదు! తల్లికి దినంపెట్టే రోజుకు సయితం చేరుకోలేకపోయినంత ఎత్తుకు ఎదిగిపోయిన తనయుడు!

పాపం వాడు మాత్రం ఏం చేస్తాడు? అంత దూరంనుండీ ఎగురుకుంటూ రావద్దూ? విమానానికి టిక్కెట్టు దొరకద్దూ?

"నా తల్లి చచ్చిపోయింది, నాకు ముందు టిక్కెట్టు కావాలి!" అంటే ఎవడన్నా యిస్తాడా?
నాకు మాత్రం గర్వం కాదూ? నా కొడుకు అమెరికాలో ఉన్నాడూ అంటే? ఉప్పొంగిపోయిన ఆ ఉత్సాహంతోనే అన్నపూర్ణ హరించిపోయింది!?

యికపోతే కూతురు, పెళ్లికానంతవరకే! గడప దాటాక చుట్టం చూపుగా కూడా కష్టమేమరి! యిప్పుడది వాళ్ల పిల్లే.

ఆ సెలవ్వరిదీ తప్పుకాదు. తప్పంతా అన్నపూర్ణదే! నన్నొంటరిగ వదిలేసి నిష్కారంగా వెళ్లిపోయింది. ఆమే ఉంటే యీ చిక్కులే ఉండకపోను. పాపం ఆవిడ మాత్రం ఏం చేస్తుంది? ఆయుషు తీరింది, వెళ్లిపోయింది. మరయితే యీ తప్పంతా ఎవరిదంట? అదిగో ఆ దేవుడిది! నాకీ వృద్ధాప్యాన్ని ప్రసాదించిన ఆ భగవంతుడిది! పాపం, అతను మాత్రం ఏం చేస్తాడు? తన విధి తను చేసుకుపోతాడు!

మరి యీ త ప్పంతా? నాది! అవును అర్థంపర్థం లేకుండా ఆలోచిస్తున్న నాదే! బలవంతంగా కళ్లు మూస్కున్నాడు పరంధామయ్య.

అతని మస్తిష్కంలో గజిబిజిగా అచ్చం అతన్లాంటి వృద్ధులే. నిర్వికారంగా తిరుగాడుతూ!
అతనికి ముందురాత్రి జరిగిన సంభాషణ గుర్తొచ్చింది. నాన్నా, మీరేం అనుకోకండి, యిలా చెప్తున్నానని, ఇంట్లో మీకు ఆలనాపాలనా చూసే వాళ్లేలేరు. టైముకు ఏమీ అందివ్వలేకపోతున్నాం.

బయట ఉంటున్నామన్న మాటేగానీ నాకూ, మీ కోడలికి కూడా మనశ్శాంతి లేకపోతుంది. యింట్లో బోర్ కదూ. తమ్ముడెలానూ మిమ్మల్ని అంతదూరం యీ వయసులో తీస్కెళ్లలేదు. మీరూ ఆలోచించండి "చూచాయిగా అర్థమయింది పరంధామయ్యకు కొడుకు చెప్పబోతున్నదేంటో.

నిజంగా తనకే గానీ గుండె ఉండి ఉంటే పగిలిపోయేదే ఆ మాట వినగానే! తను బండబారిపోయాడు, నిట్టూర్చాడు పరంధామయ్య.

అంతలో కాలింగ్ బెల్ చప్పుడయింది. పిల్లలు స్కూల్ నుండి వచ్చినట్టున్నారు. తలుపుతీసి ప్రేమగా వాళ్లనే చూస్తూ నించున్నాడు పరంధామయ్య.

"తాతయ్యా, నాకు ఫస్టు రేంకొచ్చింది" చెయ్యి పట్టుకు ఊపేస్తోన్నాడు మనవడు.
"తాతయ్యా, మా స్కూల్లో డేన్స్ నేర్పిస్తారంట" సంబరంగ కళ్లు తిప్పుతోంది మనవరాలు.
"ఏయ్ వెళ్లి యూనిఫామ్స్ మార్చుకోండి" కసిరింది అప్పుడే అడుగుపెట్టిన కోడలు పిల్ల.

పిల్లలు అక్కణ్ణించి కదిలాకే "మామయ్యగారూ, టీ తాగారా? సామాన్లన్నీ సర్దేసా, మీ అబ్బాయి వచ్చే టైమయింది. మీరూ మొహం కడుక్కోండి" అంటో ట్రంకుపెట్టె వరండాలో పెట్టింది.
అదే క్షణంలో పాడె సిద్ధం చేసినా అతడంత రోదించేవాడు కాడేమో! అంతకన్నా నరకంలా ఉంది అతని మనోస్థితి!

"నాన్నా, రెడీ అయ్యారా? నేనిప్పుడే ఫోన్‌చేసి కనుక్కున్నా. ఆ 'హోమ్ ఫర్ ఓల్డ్ ఏజ్' ఓనర్ కూడ చాలా మంచాయన. అప్పుడప్పుడు మేం వస్తుంటాం. పిల్లల్ని తెస్తుంటాం. అంతా మనిల్లులానే ఉంటుంది. మీరేం భయపడొద్దు. మీలాంటి వాళ్లు చాలామంది ఉన్నారక్కడ" ఏవో చెప్తున్నాడు కొడుకు.



## ఇష్టం

"మా వారికి నేనంటే ఎంతో ఇష్టం!"
"అవునా!"
"అవునే నేను పనిచేసి కష్టపడ్తున్నానని మరో పెళ్లి చేసుకున్నారు.'


—సిహెచ్.వి.వి.ఎస్.మూర్తి
(కొమరగిరిపట్నం)

* *

## గతి

"నన్నే ఎందుకు ప్రేమించావ్ పద్మా?"
"వేరే గతి లేక శ్రీనూ."
—పద్మశ్రీ (మాణిక్యారం)

"భయం ఎందుకు నాయనా? నీలాంటి కొడుకుండగా!" పెదవి దాటలేదు అతని హృదయరోదన.
"అమ్మా, తాతయ్య ఎక్కడికెళ్తున్నారు?" పిల్లలిద్దరూ ఒక్కసారే కంగారుగా అడిగారు.
మరేమో, తాతయ్య చాలా చాలా అలిసిపోయారు కదూ. యింతవరకూ ఆఫీసుకెళ్లి, మమ్మల్ని పెద్దాళ్లని చేసి. అందుకే అక్కడయితే మీ అల్లరి ఉండదు. హాయిగా రెస్ట్ తీస్తుంటారని" కొడుకు అర్థమయ్యేలా చెప్పాడు.
"నాన్నా, మరి నువ్వు, అమ్మా కూడా బాగా అలిసిపోతున్నారు కదూ, రోజూ ఆఫీసుకెళ్లి. మరి, మీరెప్పుడెళ్తారక్కడికి?" *








## కాంబినేషన్

సీనియర్ నటులు దిలీప్‌కుమార్, రాజ్‌కుమార్ చాలా సంవత్సరాల తర్వాత కలిసి 'సౌదాగర్'లో నటిస్తే సునీల్‌దత్, రాజేంద్రకుమార్‌లు 34 ఏళ్ళ తర్వాత 'మదర్ ఇండియా' మరియు 'ఫూల్' అనే చిత్రంలో నటించారు.

— మానస

